క్లుప్తంగా

పాలిసెట్‌లో ఉచిత శిక్షణ

తిరుపతి ఎడ్యుకేషన్: పాలిసెట్, ఏపీఆర్‌జేసీలో ప్రవేశాలకు నిర్వహించే పరీక్షకు విద్యార్థులకు ఏబీవీపీ విద్యార్థి సంఘం, ఆపస్ ఉపాధ్యాయ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. తిరుపతి న్యూ బాలాజీ కాలనీలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉచిత తరగతులను శుక్రవారం ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సాంబిరెడ్డి, ఏబీవీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి జి.విశ్వనాథరెడ్డి ప్రారంభించారు. పోటీ పరీక్షలతో పాటు స్పోకెన్ ఇంగ్లిష్‌లోనూ ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. మెటీరియల్స్‌ను పంపిణీ చేశారు.

దారిదోపిడీ కేసులో ముగ్గురు ముద్దాయిల అరెస్ట్

తిరుపతి రూరల్: గత ఏడాది తిరుపతిలో సంచలనం సృష్టించిన రూ.34 లక్షల దారి దోపిడీ కేసులో తప్పించుకుని తిరుగుతున్న ముగ్గురు ముద్దాయిలను ఎంఆర్‌పల్లి పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో ముద్దాయిలను అరెస్ట్ చూపారు. సీఐ సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ గతేడాది పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి ఢిల్లీ హోటల్ వద్ద 16 మంది ముద్దాయిలు సినిమా పక్కీలో 34 లక్షల రూపాయలను దారిదోపిడీ చేశారని చెప్పారు. ఇప్పటికే 13 మందిని అరెస్టు చేశామని, మరో నలుగురు ముద్దాయిలు తప్పించుకు తిరుగుతున్నారని, అందులో ముగ్గురు ఏ3 ముద్దాయి కడప రాయచోటికి చెందిన వీరభద్ర అలియాస్ మురుగేష్, ఏ4, ఏ16 ముద్దాయిలు కుప్పం శాంతిపురానికి చెందిన రమేష్ అలియాస్ సాయిరెడ్డి, నవీన్ అలియాస్ నవీన్‌కుమార్‌ను శుక్రవారం సీమల్లవరం వై జంక్షన్ వద్ద అరెస్ట్ చేసినట్లు చెప్పారు. వీరభద్ర నుంచి రూ.1.22 లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన అవసరం

రామచంద్రాపురం: గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీలు చేపట్టాలని ప్రకృతి వ్యవసాయ రాష్ట్ర సలహాదారు సురేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాయలచెరువుకట్ట సమీపంలోని రాయల మండపంలో డీపీఎం మునిరత్నం ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో సమీక్షించారు. రైతులకు మిశ్రమ పంటల వల్ల కలిగే లాభాలను వివరించాలన్నారు. గ్రామ సంఘాలను సమైక్య పరచుకుని రైతులు ఎంత విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారో యాప్‌లో నమోదు చేయాలని సూచించారు.

తనపల్లిలో ఎన్ఎస్ఎస్ క్యాంప్

తిరుపతి రూరల్: శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం యూనిట్–3 దత్తత గ్రామమైన తనపల్లిలో ఈనెల 21 నుంచి 27 వరకు నిర్వహించనున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరాన్ని కో–ఆర్డినేటర్ ఆచార్య కాత్యాయని ప్రారంభించారు. ప్రోగ్రాం అధికారిణి నీరజ, సర్పంచ్ సునీత పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలను కొనసాగిస్తాం

తిరుపతి రూరల్: ఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని ఆ సంస్థ సీఎండీ సంతోషరావు తెలిపారు. తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు.

ముస్లింలకు రంజాన్ తోఫా



రంజాన్ తోఫాను అందిస్తున్న దివాకర్‌రెడ్డి

తిరుపతి రూరల్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని డాలర్స్ గ్రూప్ చైర్మన్ దివాకర్‌రెడ్డి ముస్లింలకు రంజాన్ తోఫాను పంపిణీ చేశారు. శుక్రవారం సీమల్లవరంలో 100 కుటుంబాలకు వీటిని అందించారు.

వైద్యులకు విశ్రాంతి భవనం ప్రారంభం

తిరుపతి తుడా: రుయా ఆస్పత్రిలో వైద్య సేవలు అందిస్తున్న వైద్యులకు విశ్రాంతి తీసుకునేందుకు బర్న్సు వార్డ్ సమీపంలో ఏర్పాటు చేసిన విశ్రాంతి భవనాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖరన్, సూపరింటెండెంట్ నాగమునేంద్రుడు, పల్మనాలజీ విభాగాధిపతి సుబ్బారావు, చిన్నపిల్లల ఆసుపత్రి విభాగాధిపతి కిరీటి, డాక్టర్లు రాయుడు, నాగేశ్వరరావు, రవి శంకర్, ఫహీం పాల్గొన్నారు.

గృహనిర్మాణాల్లో పురోగతి ఉండాల్సిందే

- 50 శాతం గృహాలు తిరుపతి డివిజన్‌లోనే..
- డివిజన్ స్థాయి సమీక్షలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకుని వాటికి పరిష్కారం చూపితేనే గృహనిర్మాణాల్లో పురోగతి ఉంటుందని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి అన్నారు. తిరుపతి ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంపై తిరుపతి డివిజన్ స్థాయి సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. గృహ నిర్మాణ శాఖ అధికారులు ఆయా ప్రాంతాల్లోని జగనన్న లేఅవుట్లను పరిశీలన చేసిన తర్వాత స్థానికంగా సమస్యలు తెలుసుకుని వాటికి పరిష్కారం చూపాలని సూచించారు. గృహనిర్మాణాలకు అవసరం అయిన అన్ని సదుపాయాలను కల్పించడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. జిల్లాలోని మొత్తం గృహనిర్మాణాల్లో 50 శాతం తిరుపతి డివిజన్ పరిధిలోనే ఉన్నాయని వివరించారు. తిరుపతి డివిజన్‌లో మంజూరైన 33,296 గృహాల్లో 4752 మాత్రమే పూర్తి చేశారని చెప్పారు. మిగిలిన ఇండ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయన్నారు. ఇంటి నిర్మాణాల్లో పురోగతి చూపాలని స్పష్టం చేశారు. మరోవైపు జగనన్న లేఅవుట్లలో రోడ్లు, విద్యుత్ సౌకర్యం, తాగునీటి వసతులు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో తిరుపతి ఆర్డీఓ కనక నరసారెడ్డి, గృహ నిర్మాణ శాఖ సంచాలకులు వెంకటేశ్వర్లు, హౌసింగ్ డీఈ మనోహర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయ కుమార్, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ కృష్ణా రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ చంద్ర మౌళీశ్వర్ రెడ్డి, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

గంగజాతరకు పటిష్ట భద్రత



మాట్లాడు తున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తిరుపతి క్రైం: గంగజాతరకు పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం పోలీస్ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన నేర సమీక్షా సమావేశంలో తిరుపతి జిల్లాలోని అధికారులు, సిబ్బందికి ఆయన పలు సూచనలు, సలహాలు అందించారు. గంజాయి నిర్మూలనకు పోలీస్‌లు సంయుక్తంగా కార్యాచరణ రూపొందించాలన్నారు. గతంలో పోలీస్‌శాఖ సమన్వయంతో ఆపరేషన్ పరివర్తన 2.0ను అమలు చేసి సత్ఫలితాలు సాధించామని, ఇప్పుడు అదే స్ఫూర్తితో యాంటీ డ్రగ్స్ స్పెషల్ డ్రైవ్‌ను జిల్లా వ్యాప్తంగా అమలు చేయాలని చెప్పారు. తిరుపతి జిల్లా పరిధిలో గంజాయి రవాణా, విక్రయించే ప్రాంతాలు, గంజాయి సేవించే ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ప్రతి స్టేషన్‌లో మిస్సింగ్ నమోదు కేసులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి దర్యాప్తు చేయాలన్నారు. మహిళా సంరక్షణ కార్యదర్శులతో పనిచేయించుకోవాలని సూచించారు. రంజాన్ రోజున మసీదుల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశించారు. ఏఎస్పీలు విమలకుమారి, కులశేఖర్, మునిరామయ్య, సెబ్ డైరెక్టర్ రాజేంద్ర పాల్గొన్నారు.

సెలవుల్లోనూ పన్నులు చెల్లించవచ్చు

తిరుపతి తుడా: సెలవు రోజుల్లోనూ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఆస్తి, వీఎల్‌టీ పన్నులు చెల్లించుకునేందుకు కౌంటర్లు అందుబాటులో ఉంటాయని కమిషనర్ హరిత తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి ముందస్తుగా పన్నులు చెల్లించే వారికి ప్రభుత్వం పన్నులో ఐదు శాతం రాయితీ ప్రకటించిందని తెలిపారు. ఈ నెల 30వ తేదీ లోపు పన్నులు చెల్లించే వారికి రాయితీ వర్తిస్తుందన్నారు. పన్నులు చెల్లించేందుకు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు కౌంటర్లు అందుబాటులో ఉంటాయన్నారు. రంజాన్, ఆదివారం సెలవు రోజులు అయినా కౌంటర్లు తెరిచే ఉంటాయని పేర్కొన్నారు.

తిరుచ్చిపై సిరులతల్లి



తిరుచ్చిపై భక్తులకు దర్శనమిస్తున్న శ్రీవారిపట్టపు రాణి

తిరువానూరు(చంద్రగిరి): తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై భక్తులను అనుగ్రహించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను శ్రీకృష్ణముఖ మండపం వద్ద కొలువుదీర్చి కనుల పండువగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి ఊంజల్ సేవను నిర్వహించారు. తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 6 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 56,680 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 18,947 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామి వారికి హుండీ కానుకల ద్వారా రూ.3.54 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం అవుతోంది. టిక్కెట్లు లేని భక్తులకు 10 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం కలుగుతోంది.

పవిత్రతకు ప్రతీక రంజాన్



మత గురువులకు నగదు అందజేస్తున్న మోహిత్‌రెడ్డి

భాకరాపేట/పాకాల: పవిత్రతకు ప్రతీక అయిన రంజాన్ మాసాన్ని నడిపిస్తున్న మత పెద్దలకు ఆర్థిక సాయం అందించడం అదృష్టంగా భావిస్తున్నాని చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. చిన్నగొట్టిగల్లు, పాకాల మండలాలకు చెందిన 29 మసీదుల్లోని మత గురువులకు రూ.10 వేల చొప్పున మొత్తం రూ.2.9 లక్షలను శుక్రవారం అందజేశారు. ప్రతి ముస్లిం సోదరుడు పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి రంజాన్ కానుకలను అందజేశారని తెలిపారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, పార్టీ నాయకులు రెడ్డెప్పరెడ్డి, చెంగల్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, శివలక్ష్మి, సహదేవ రెడ్డి, ఖదీర్‌అహ్మద్, నంగా బాబురెడ్డి పాల్గొన్నారు.

అవే విద్యార్థి కెరీర్‌ను నిర్ణయిస్తాయి

తిరుపతి కల్చరల్: విద్యార్థి జీవితంలో పదో తరగతి తర్వాత ఎంచుకునే కోర్సులే వారి కెరీర్‌ను నిర్ణయిస్తాయని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఇండియా తిరుపతి జిల్లా అధ్యక్షురాలు ఎం.పద్మ అన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడారు. తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23న యూత్ హాస్టల్ వేదికగా ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అసోసియేషన్ గౌరవ సలహాదారు వీర కిరణ్ మాట్లాడుతూ.. కార్యక్రమానికి హాజరయ్యే వారు రూ.100లతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. స్పాట్ రిజిస్ట్రేషన్ కూడా ఉందని, ఈ అవకాశాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బలిజ భవన్ ప్రహరీ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూమన

తిరుపతి కల్చరల్: నరసింహ తీర్థం రోడ్డులోని బలిజ భవన్ వద్ద నిర్మిస్తున్న ప్రహరీగోడ నిర్మాణ పనులను ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష పరిశీలించారు. పనులపై ఇంజినీర్, మేస్త్రీలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా పనులు పూర్తి చేయాలని వారికి సూచించారు.

26, 27వ తేదీల్లో బాలాలయ సంప్రోక్షణ

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం కందులవారిపల్లెలోని శ్రీశేషాచల లింగేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 26, 27 తేదీల్లో బాలాలయ సంప్రోక్షణ నిర్వహించనున్నారు. గర్భాలయంలో జీర్ణోద్ధరణ కోసం 'బాలాలయం' చేస్తారు. ఇందుకోసం ఆలయంలోని ముఖ మండపంలో నమూనా ఆలయం ఏర్పాటు చేసి గర్భాలయంలోని మూలవర్ల చిత్రపటాలను ఉంచుతారు. 26న సాయంత్రం గణపతి పూజ, పుణ్యాహవచనం, వాస్తు హోమం, మేదిని పూజ, అంకురార్పణ నిర్వహించనున్నారు.

విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు



నియామకపత్రాలు అందుకున్న విద్యార్థులు

తిరుపతి కల్చరల్: కరకంబాడి రోడ్డులోని రామి అకాడమీ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు రామి గ్రూప్ ఆఫ్ హోటల్స్ ఉపాధ్యక్షుడు సౌరబ్ శుక్రవారం నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ కళాశాలకు చెందిన విద్యార్థులకు దేశ విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించామని తెలిపారు. అకాడమీ ప్రిన్సిపల్ నిషార్ అహ్మద్, రామి గెస్ట్‌లైన్ హోటల్ ప్రాజెక్ట్ మేనేజర్ గణపతి పాల్గొన్నారు.

వాటర్ కెటిల్స్ వితరణ



రోగికి వాటర్ కెటిల్ అందజేస్తున్న జీవన్‌కుమార్

తిరుపతి కల్చరల్: దక్షిణ భారత ఆర్యవైశ్య శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ధర్మశాల సంస్థ 7వ వార్షికోత్సవం, అక్షయతిథిని పురస్కరించుకుని ఆ సంస్థ (గుబ్బా సత్రం) ఎండీ జీవన్‌కుమార్ శుక్రవారం అలిపిరి రోడ్డులోని టాటా క్యాన్సర్ ఆస్పత్రి రోగులకు, సిబ్బందికి వాటర్ కెటిల్స్, హాట్ వాటర్ బాటిల్స్ వితరణ చేశారు. త్వరలో మృతదేహాలను తరలించేందుకు అవసరమైన వాహనాన్ని వితరణ చేయనున్నట్లు తెలిపారు. డాక్టర్ శివకుమార్, రమణయ్య పాల్గొన్నారు.

దళితులు బాబును నమ్మే స్థితిలో లేరు

తిరుపతి మంగళం: దళితులపై చిన్నచూపు చూసే చంద్రబాబును దళితులెవ్వరూ నమ్మే స్థితిలో లేరని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు నల్లాని బాబు అన్నారు. ఆయన పాలనలో దళితులకు అన్యాయం జరిగిందన్నారు. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక దళితులకు మంచి రోజులు వచ్చాయని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో దళితులంతా వైఎస్సార్‌సీపీకే మద్దతుగా ఉన్నామని స్పష్టం చేశారు.

భూసార పరీక్షలు చేయించుకోండి



ప్రకృతి వ్యవసాయ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

తిరుపతి అర్బన్: ప్రతిరైతూ భూసార పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి (డీఏవో) ఎస్.ప్రసాద్‌రావు సూచించారు. భూసారాన్ని బట్టి పంటల మార్పిడి చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. భూసార పరీక్షల నిర్వహణపై జిల్లాలో పది రోజుల పాటు అవగాహన సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. ఇప్పటివరకు 715 మంది రైతులు పరీక్షల కోసం మట్టి నమూనాలు ఇచ్చారని వెల్లడించారు. తిరుపతి, శ్రీకాళహస్తి, గూడూరు, చంద్రగిరి, వెంకటగిరి ప్రాంతాల్లో భూసార పరీక్షా కేంద్రాలున్నాయని తెలిపారు. పీఎం కిసాన్ పథకాన్ని పొందడానికి ప్రతిరైతూ వైఎస్సార్ రైతు భరోసా కేంద్రంలో ఈనెల 30వ తేదీలోపు ఈకేవైసీ చేయించుకోవాలని స్పష్టం చేశారు. ఖరీఫ్‌లో 14,280 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు, 2,400 క్వింటాళ్ల వరి విత్తనాలు, 2,200 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు, 10 క్వింటాళ్ల పెసరు, 10 క్వింటాళ్ల మినుములు, 10 క్వింటాళ్ల కంది విత్తనాలను సబ్సిడీతో మే మొదటి వారం నుంచి ఆర్బీకేల్లో పంపిణీ చేస్తామన్నారు. ప్రకృతి వ్యవసాయానికి చెందిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

మోదీ బాబా 30మంది దొంగలు



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

తిరుపతి కల్చరల్: దేశంలోని సంపదను కొల్లగొట్టి 30 మందికి నరేంద్ర మోదీ పంచి పెడుతున్నారని, నాడు ఆలీబాబా 40 మంది దొంగలు అనే నానుడి ఉండేదని, నేడు మోదీ బాబా 30 మంది దొంగలుగా మారిందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ధ్వజమెత్తారు. 30 మందిలో ఇప్పటికే 29 మంది విదేశాలకు వెళ్లిపోయారని, ఒక్క అదానీ మాత్రమే మిగలగా అతనికి ప్రభుత్వ ఆస్తులు కట్టబెడుతున్నారని తెలిపారు. శుక్రవారం తిరుపతి సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాహుల్‌పై అనర్హత వేటు వేయడం కక్షపూరిత చర్య అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఓబులేసు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మే 3వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అఖిలపక్షం ఆధ్వర్యంలో రాస్తారోకోలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

గంజాయి సరఫరాకు కేంద్రాలుగా అదానీ పోర్టులు

గంజాయి, మత్తుపదార్థాల సరఫరాకు కేంద్రాలుగా అదాని పోర్టులు మారిపోయాయని నారాయణ ధ్వజమెత్తారు. సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం తిరుపతి నగరంలో జరిగిన బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. మోదీ నల్లధనం బయటకు తీస్తామని నోట్లు రద్దు చేసి బ్లాక్ మనీ మొత్తం తమకు కావాల్సిన వారి ఇళ్లకు చేర్చారని విమర్శించారు. దేశాన్ని రక్షించుకోవాలంటే బీజేపీ వ్యతిరేక శక్తులు అన్ని ఏకం కావాలని కోరారు. సీపీఐ రాష్ట్ర నేతలు జి.ఓబులేసు, రామానాయుడు, చిన్నం పెంచలయ్య, శ్రీనివాస్, నాగరాజు, సూరి పాల్గొన్నారు.

గడప గడపలో విశేష ఆదరణ



సంక్షేమ బుక్‌లెట్‌ను అందజేస్తున్న డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం: నగరంలోని 21వ డివిజన్ ఎస్వీ నగర్‌లో డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, కార్పొరేటర్ ఈశ్వరి శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏ గడపకు వెళ్లినా ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది. హారతులతో మహిళలు నీరాజనం పలికారు. నాలుగేళ్ల పాలనలోనే జగనన్న తమకు చేసిన మేలు అంతా ఇంతా కాదని స్థానిక మహిళలు అభినయ్ వద్ద ఆనందాన్ని వ్యక్తం చేశారు. తమ జీవితాల్లో వెలుగులు నింపారని, తాము ఆర్థికంగా ఎదిగేందుకు ఎంతో దోహదపడ్డారని మురిసిపోయారు. జగనన్నకు అందరూ అండగా ఉండాలని అభినయ్ కోరారు. పార్టీ నాయకులు మబ్బు నాథమునిరెడ్డి, తిమ్మారెడ్డి, కుమార్, మనోహర్‌రెడ్డి, డిష్ చంద్ర, అనీల్, నాగరాజ్, జీవన్, రెడ్డిరాణి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జాతీయ ప్రజాసంబంధాల దినోత్సవం



తిరుచానూరు(చంద్రగిరి): పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్ఎస్ఐ) తిరుపతి చాప్టర్ ఆధ్వర్యంలో శుక్రవారం తిరుచానూరు రోడ్డులోని జెమ్స్ బిజినెస్ స్కూల్లో జాతీయ ప్రజా సంబంధాల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ×జీ 20, భారతీయ విలువలు : ప్రజాసంబంధాల దృక్కోణం అనే అంశంపై వక్తలు ప్రసంగించారు. ముఖ్య అతిథిగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత మధురాంతకం నరేంద్ర మాట్లాడుతూ.. మేనేజ్మెంట్, సాంకేతిక విద్య చదువుతున్న విద్యార్థులకు మానవీయ శాస్త్రాల అధ్యయనం చాలా అవసరమన్నారు. అనంతరం ప్రజా సంబంధాల రంగంలో విశిష్ట సేవలు అందించిన తిరుపతి చాప్టర్ వ్యవస్థాపక చైర్మన్ సి.రమాకాంత శర్మను సన్మానించారు. హరీంద్ర, కె.శ్రీనివాసరావు, దుద్యాల చంద్రమోహన్ పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: తిరుమల శ్రీవారిని శుక్రవారం రాష్ట్ర సమాచారశాఖ మంత్రి శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

34 మందికి జరిమానా

తిరుపతి లీగల్: తిరుమలలో మద్యం తాగి వాహనాలు నడపడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం వంటి నేరాలకు పాల్పడిన 34 మందికి రూ.24,800 జరిమానా విధిస్తూ తిరుపతి 2వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు శుక్రవారం తిరుమల క్యాంప్‌కోర్టులో తీర్పు చెప్పారు.

రంజాన్ ప్రార్థనలకు విస్తృత ఏర్పాట్లు

తిరుపతి తుడా: రంజాన్ పర్వదినాన ముస్లిం సోదరులు ప్రార్థనలు నిర్వహించుకునేందుకు సౌకర్యవంతమైన ఏర్పాట్లు చేశామని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత అన్నారు. ఈద్గా మైదానంలో చేపట్టిన రంజాన్ ఏర్పాట్లను శుక్రవారం డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డితో కలిసి ఆమె పరిశీలించారు. ఎండలు తీవ్రతరంగా ఉన్న నేపథ్యంలో చలువ పందిళ్లు వేయించినట్లు చెప్పారు. ప్రార్థనలు జరిగే సమయంలో చల్లదనం కోసం కూలర్లు, ఫ్యాన్లు, తాగునీరు వంటి సౌకర్యాలను కల్పించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముస్లింలకు కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఎస్.కె.బాబు, కో–ఆప్షన్ సభ్యులు ఇమామ్ సాహెబ్, ఖాదర్ బాషా, తిరుపతి ఖాజి సయ్యద్ షఫీ మహమ్మద్ ఖాద్రీ, చోటా ఖాసిమ్, ఇమ్రాన్ ఉన్నారు.

కాపర్ చోరీ కేసులో నలుగురి అరెస్ట్

80 కేజీల కాపర్ స్వాధీనం

వెదురుకుప్పం: మండలంలో నెల రోజులుగా వివిధ ప్రాంతాల్లో జరిగిన చోరీ కేసులకు సంబంధించి నలుగురు నిందితులను శుక్రవారం వెదురుకుప్పం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ లోకేష్ కథనం మేరకు.. మండలంలోని జక్కిదొన, దేవరగుడిపల్లె, పచ్చికాపల్లం ప్రాంతాల్లో నెల రోజులుగా పలు దొంగతనాలు జరిగాయి. పొలాల వద్ద బోరు మోటార్లు, రాగి వైర్లు కత్తిరించుకుని అపహరించుకు వెళ్లారు. శుక్రవారం పచ్చికాపల్లంలో వాహనాల తనిఖీ చేస్తుండగా మోటార్ సైకిళ్లలో వెళ్తున్న తిరుపతికి చెందిన నలుగురు యువకులను అనుమానం వచ్చి ఆపి తనిఖీ చేశారు. వారి వద్ద కాపర్ ఉండగా పట్టుకున్నారు. 80 కేజీల కాపర్ వైరు, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కాపర్ విలువ రూ.లక్ష విలువ ఉంటుందని అంచనా వేశారు. తిరుపతికి చెందిన ఠాగూర్, కార్తీక్, అరవింద్, మునికుమార్‌ను అరెస్ట్ చేసి పుత్తూరు కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్లు ఎస్ఐ చెప్పారు.

జగనన్నతోనే సంచార జాతుల సంక్షేమం

తిరుపతి కల్చరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంచార జాతుల సంక్షేమం సాధ్యమవుతోందని ఆంధ్రప్రదేశ్ ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెంద్ర వీరన్న అన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. గత టీడీపీ పాలనలో సంచార జాతుల్లోని తోలుబొమ్మలాట కళాకారులు, గంగిరెద్దులు, దొమ్మర వంటి కులాలకు కనీసం కుల ధృవీకరణ పత్రాలు కూడా లేని పరిస్థితి ఉండేదన్నారు. పాదయాత్రలో జగనన్న సంచారుల కష్టాలు గుర్తించి వారి సంక్షేమానికి కృషి చేస్తున్నారని తెలిపారు. కుల ధృవీకరణ పత్రాలకు జీఓ తీసుకొచ్చారని తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్దన్, గంగిరెద్దుల సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తల రమణమయ్య పాల్గొన్నారు.

కలెక్టర్‌కు చిత్రపటం బహూకరణ

తిరుపతి అర్బన్: వెంకటగిరికి చెందిన పెన్సిల్ కళాకారుడు పాలిశెట్టి శంకర్ బాబు జిల్లా కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి చిత్రపటాన్ని పెన్సిల్‌తో తీర్చిదిద్దారు. దాన్ని శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు బహూకరించారు. ఈ సందర్భంగా పాలిశెట్టి శంకర్‌బాబును కలెక్టర్ అభినందించారు.

ఆ స్థలాన్ని దేవాలయానికి అప్పగించండి

తిరుపతి లీగల్: తిరుపతి గిరిధర్‌దాస్ కాలనీలోని 90 సెంట్ల భూమి, ఆ భూమిపై ఉన్న కట్టడాలను తిరుపతి నాదముని ఆళ్వార్ స్వామి దేవాలయానికి నెలలోపు లీజుదారుడు అప్పగించాలని రాష్ట్ర ఎండోమెంట్ ట్రిబ్యునల్ ఇటీవల తీర్పుచెప్పినట్లు ఎండోమెంటు న్యాయ సలహాదారుడు, న్యాయవాది పి.ఐలరాం శుక్రవారం తెలిపారు. ప్రస్తుతం ఆ స్థలం విలువ సుమారు రూ.60 కోట్లకు పైగా ఉంటుందని సమాచారం.